క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కథలాపూర్: ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కిరణ్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసులు నమోదైన వారు కోరుట్ల కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌కు హాజరై వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామానికి చెందిన లైసెట్టి గణేశ్‌కు రూ.60 వేలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించినట్లు సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. గణేశ్ అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి మంజూరైందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డికి గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తె, మెట్టెల అందజేత



పుస్తె, మెట్టెలు అందిస్తున్న డెయిరీ సభ్యులు

రాయికల్: మండలంలోని ఆలూర్ గ్రామంలోని కొంగరి రాజేశ్వర్‌రెడ్డి-సునీత దంపతుల కూతురు రచన రెడ్డి వివాహం గురువారం జరగగా, కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో వధువుకు పుస్తెమెట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల డెయిరీ సంఘం అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ రాజేశ్, కార్యదర్శి మహేశ్, డైరెక్టర్ నల్లాల సర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హరీశ్

మల్యాల: మండలంలోని ముత్యంపేట బీజేవైఎం అధ్యక్షుడిగా బూస హరీశ్ యాదవ్‌ను నియమిస్తూ మండల అధ్యక్షుడు రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు హరీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

'జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి'



సన్మానిస్తున్న నిషాంత్ కార్తికేయ

మల్లాపూర్ : జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూదరి నిషాంత్ కార్తికేయ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన టీయుడబ్ల్యూజే (హెచ్–143) ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రమేశ్, కార్యదర్శి మోర సతీశ్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యభద్రత కల్పించి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని, ఇళ్లస్థలాలతో పాటు డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు తోకల పవన్ (ప్రవీణ్), నాయకులు సంగ గంగరాజం, కోటగిరి ఆనంద్‌గౌడ్, లవంగ శివకుమార్, ముత్యాల రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



లారీలోంచి బస్తాలు దించుతున్న కూలీలు

ఇబ్రహీంపట్నం : మండలంలో రైతులకు యురియా అందుబాటులో ఉందని సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, కార్యదర్శి మంత్రి సతీశ్ గురువారం తెలిపారు. ఇబ్రహీంపట్నం సింగిల్‌విండోలో 450 బస్తాలు, మండలంలోని వర్షకొండలో 450 యూరియా బస్తాలు రైతులకు అందుబాటులో ఉంచామని, యూరియా అవసరమున్న రైతులు తీసుకెళ్లవచ్చని ఆయన తెలిపారు. యురియా ఇక కొరత లేదని రైతులు అందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు.



కోరుట్ల : కృష్ణుడు, గోపికల వేషధారణల్లో సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు



మల్లాపూర్ : బీసీ హాస్టల్ ఆవరణలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

ఘనంగా కృష్ణాష్టమి

శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఉట్టి కొట్టే వేడుకలను నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురికి బహుమతులు ప్రదానం చేశారు. పలు పాఠశాలల్లో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం శ్రీ కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. గొల్లపల్లిలో వైస్ ఎంపీపీ ఆవుల సత్యం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామంలో కృష్ణుడి విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



రాయికల్: ప్రగతి ఉన్నత పాఠశాలలో చిన్ని కృష్ణుడి, గోపికల వేషధారణల్లో చిన్నారులు



గొల్లపల్లి : ఒగ్గుడోలు కళాకారుల ఆటాపాట



జగిత్యాల టౌన్: రామాయలంలో నిర్వహించిన వేడుకల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు



గొల్లపల్లిలో : శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు



మెట్‌పల్లి రూరల్ : ఇస్కాన్ ఆలయంలో పూజలు చేస్తున్న మెట్‌పల్లి, ఖానాపూర్ మెజిస్ట్రేట్‌లు



కథలాపూర్ : దుంపేటలో ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న యువకులు

కార్యవర్గం ఎన్నిక



మహిపాల్

రాయికల్: మండల కారోబార్ల సంఘం అధ్యక్షుడిగా రాజోల్ల మహిపాల్, ఉపాధ్యక్షుడిగా పడిగెల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ముల్క జలేందర్, కోశాధికారిగా మ్యాకల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా పాలకుర్తి సంపూర్ణ, కార్యవర్గ సభ్యులుగా బత్తుల శంకర్, రాజేందర్, దొంతి రాజేందర్, కిశోర్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మెట్‌పల్లి: మల్లాపూర్ మండలంలోని సంగెం గ్రామంతో పాటు చిట్టాపూర్ బుడిగె జంగం కాలనీ వాసులు గురువారం పట్టణంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని బుడిగె జంగం కాలనీవాసులు తీర్మానించిన కాపీని వారికి అందజేశారు.

బీజేపీ నాయకుల పూజలు



పూజలు చేస్తున్న నవీన్ కుమార్, నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో శ్రీకృష్ణ దేవాలయం, విద్యా ప్రకాశ నందగిరి స్వామి గీతాశ్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ గురువారం సందర్శించారు. ధర్మారంలో గోశాలను సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబల్ల సుదర్శన్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, ఎస్సీమోర్చా కార్యవర్గ సభ్యుడు రమేశ్, మహేశ్, రితేష్, మురళి, మహేశ్, దామోదర్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు

కుల సంఘాల అభివృద్ధికి పెద్దపీట



మాదాపూర్‌లో ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల రూరల్ : నియోజకవర్గంలో కులసంఘాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాదాపూర్, మోహన్‌రావుపేట గ్రామాల్లో పలు కులసంఘ భవనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ప్రొసీడింగ్ పత్రాలను ఆయా కుల సంఘ పెద్దలకు అందజేశారు. మాదాపూర్‌లో శాలివాహన, అంబేద్కర్ యువజన సంఘం, మాల, మాదిగ సంఘ భవనాల అభివృద్ధికి రూ. 2లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. మోహన్‌రావుపేటలో ముదిరాజ్, గంగపుత్ర, మాదిగ మహిళా సంఘం, గౌడ, పద్మశాలీ, ఒడ్డెర, యాదవ సంఘ భవనాల అభివృద్ధికి, గౌడ సంఘ భవనం వద్ద బోర్ నిర్మాణానికి రూ. 2 లక్షల చొప్పున, రూ.25 లక్షల నిధులు మంజూరు చేసి ఆయా కుల సంఘాల పెద్దలకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని కులసంఘ అభివృద్ధికి నిధులు అందిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌ను ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే నియోజకవర్గం ఐటీ, వైద్య రంగాల్లో దుసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచులు దారిశెట్టి రాజేశ్, సరికెల్ల మల్లారెడ్డి, ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, కారుకూరి నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

మండలంలోని ధర్మారంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం గోశాలలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ ఇప్ప మంగ, ఎంపీటీసీ నాగిరెడ్డి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో కులసంఘాల అభివృద్ధికి నిదుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు క్యాంపు కార్యాలయంలో ఆయా సంఘాల నాయకులకు అందజేశారు. 13 వ వార్డులో విశ్వ వయోవృద్ధుల సంఘం భవనానికి రూ.5లక్షలు, రెండో వార్డులో యాదవ సంఘానికి రూ.3 లక్షలు, 14వ వార్డులో శ్రీశైల మల్లికార్జున యాదవ సంఘానికి రూ.3లక్షలు, 11వ వార్డులో గణేశ్ నవ దుర్గ మండలి సంఘానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ పత్రాలను ఆయా సంఘాల నాయకులకు అందజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



ర్యాలీ తీస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం : రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి సంవత్సరం పూర్తి అయినందున ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద సుభాశ్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. అంబేద్కర్, చాకలి ఐలమ్మ, ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మండల అధ్యక్షుడు బైండ్ల శ్రీకాంత్ అన్నారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్ అక్బర్, మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుత్బుద్దీన్, మండల ఫిషర్‌మెన్ అధ్యక్షుడు నందం, నాయకులు దీపక్ రాజ్, శ్రీకాంత్, సాగర్, మోహన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ రాజ్, గంగాధర్, రజినీకాంత్, ఎండీ జనీల్, మొగిలి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: జోడోయాత్రతో దేశ రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకున్నాయని సుప్రీంకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు కొమొరెడ్డి కరం పేర్కొన్నారు. జోడోయాత్ర వార్షికోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు నివాసం నుంచి నాయకులు డిపో చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిట సత్యంరెడ్డి, హన్మాండ్లు, యామ రాజయ్య, షాకీర్, సురభి అశోక్, రైసుద్దీన్, ప్రవీణ్, గంగారెడ్డి, లక్ష్మీ, తదితరులున్నారు.

విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ నాయకులు

మల్యాల: మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ వద్ద ముదిరాజ్ మండల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఎంపీపీ మిట్టపల్లి సుదర్శన్ ఆవిష్కరించారు. అంతకుముందు పోచమ్మవాడలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కొరివి కృష్ణస్వామి విగ్రహాన్ని స్థానిక ఎంపీపీ మిట్టపల్లి విమల, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిట్టల శ్రీనివాస్, బొజ్జ నర్సయ్య, శేఖర్, దండు అశోక్, కొంక నర్సయ్య, కుమారస్వామి, నీలి రవి, రఘు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

రాయికల్(జగిత్యాల): మండలంలోని సింగారావుపేట గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.21,510 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

11 నుంచి నిరవధిక సమ్మె

కథలాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని ఆ సంఘం ప్రతినిధులు సునిత, జలజ పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

జలపాతం కనువిందు



కథలాపూర్(వేములవాడ): ఇటీవల వర్షాలకు కథలాపూర్ మండలం పోతారం శివారులో గల లొంక రామేశ్వరస్వామి ఆలయ సమీపంలో గుట్టల నుంచి నీరు ఉధృతంగా పారడంతో జలపాతంలా ప్రజలను కనువిందు చేస్తుంది. గుట్టలో నుంచి వచ్చే నీరు లొంక రామేశ్వరస్వామి కోనేరులోకి చేరుతుండటంతో భక్తులు పూజలు చేస్తున్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- కార్యకర్తలకు అండగా ఉంటా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తాట్లావాయికి చెందిన 50 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్నివర్గాలకు సీఎం కేసీఆర్ సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రైతుల కోసం మిషన్ కాకతీయ, కాళేశ్వరం, చెక్‌డ్యామ్‌లు, పాఠశాలల అభివృద్ధికి మన ఊరు- మన బడి, నిరుపేదల సంక్షేమం కోసం ఆసరా పింఛన్లు ప్రవేశపెట్టారన్నారు. ప్రతి ఇంట్లో లబ్ధిదారులున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలందరికీ తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సర్పంచ్ సాగరిక శ్రీనివాస్, ఉపసర్పంచ్ మల్లేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు రంజిత్, మండల రైతుబంధు సమితి కన్వీనర్ మోహన్‌రావు, నాయకులు రాంచందర్ రావు, వెంకటేశ్వర రావు, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే మైనార్టీలకు న్యాయం

జగిత్యాల: సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రానికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్ వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ చైర్మన్‌ను కలిసి సన్మానించారు. మైనార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 204 మైనార్టీ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ. 1.20 లక్షలు ఖర్చు చేస్తుందని తెలిపారు. మైనార్టీలకు విదేశాల విద్య కోసం రూ.20 లక్షల స్కాలర్‌షిపులు అందిస్తున్నామన్నారు. మైనార్టీ పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, నదీం, మోసిన్, అమీన్, రాజి, రియాజ్ మామ తదితరులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి



అవగాహన కల్పిస్తున్న సీఐ కోటేశ్వర్

పెగడపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మల్యాల సీఐ బిల్ల కోటేశ్వర్ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై గురువారం పెగడపల్లిలో అవగాహన కల్పించారు. గ్రామాల్లో దొంగతనాలు, రోడ్డు ప్రమదాలు తదితర ఘనటలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా సీసీ కెమెరాలు ఉపయోగ పడుతాయన్నారు. కాలనీలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణకు సహకరించాలని సీఐ కోరారు. కొడిమ్యాల ఎస్ఐ వెంకట్‌రావు, ఏఎస్సై సత్తయ్య, పోలీసులు పాల్గొన్నారు.